గని ప్రభావిత ప్రాంత అభివృద్ధిలో నిర్లక్ష్యం తగదు
● రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంజయ్ ఎస్ బిజ్జూర్
9
వైభవంగా జడే సిద్దేశ్వర రథోత్సవం



అంధుల మహిళా క్రికెట్ జట్టును అభినందిస్తున్న సీఎం సిద్దరామయ్య



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతో..

మీ విజయం చరిత్రలో పదిలం

● ప్రపంచ కప్‌ను జయించిన అంధుల మహిళా క్రికెట్ జట్టును అభినందించిన సీఎం సిద్దరామయ్య
● కర్ణాటక వారికి రూ.10లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ● ఇతర రాష్ట్రాల వారికి రూ.2లక్షలు: సీఎం

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంధుల టీ-20 క్రికెట్‌లో వరల్డ్‌కప్ సాధించిన భారతీయజట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందని, మీ గెలుపు ఎందరికో స్ఫూర్తినిస్తుందని సీఎం సిద్దరామయ్య జట్టు సభ్యులను అభినందించారు. బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కృష్ణ'లో మంగళవారం జట్టు సభ్యులందరినీ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. జట్టు కెప్టెన్, తుమకూరు జిల్లా శిరాకు చెందిన దీపికా నాయకత్వాన్ని, ఆట నైపుణ్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరింత సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కర్ణాటక క్రికెట్ క్రీడాకారులకు తలా రూ.10లక్షల నగదు బహుమతితోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జట్టులో ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు తలా రూ.2లక్షల బహుమతిగా ఇస్తామన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన 13మంది క్రీడాకారులకు తలా రూ.2లక్షల రివార్డు దక్కనుంది. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

జట్టును అభినందించిన విజయేంద్ర

మహిళా క్రికెట్‌జట్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని చాన్సెరి పెవిలియన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన టీం సభ్యులను అభినందించారు. ప్రపంచకప్ విజేతల్లో కర్ణాటక కీలక స్థానం జట్టును ప్రోత్సహించిన సమర్థనం ట్రస్టు అధ్యక్షుడు, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ మెంటార్ డాక్టర్ మహంతేశ్‌ను ప్రశంసించారు. ఎంపీ పీసీ మోహన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శరణు తళ్ళికేరి, బెంగళూరు నగర అధ్యక్షుడు సప్తగిరి గౌడ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో 7.01 కోట్లు రికవరీ

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏటీఎంలకు నగదు సమకూర్చే సీఎంఎస్ వాహనం నుంచి రూ.7.11కోట్లు దోపిడీ చేసిన కేసులో తాజాగా మరో రూ.47లక్షలు స్వాధీనం చేసుకోవడంతో ఇంతవరకు 7.01 కోట్ల రూపాయలను రికవరీ చేసినట్లయ్యింది. ఈ కేసులో ఇప్పటివరకు 9మందిని అరెస్టు చేసి రూ.7.01 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక కేవలం రూ.10లక్షలు మాత్రమే మిగిలి ఉంది. హైదరాబాద్ లాడ్జ్‌లో రూ.53లక్షలతో ఒక నిందితుడు పట్టుబడగా అతడిని విచారించారు. అతను ఇచ్చిన సమాచారంతో కుప్పంలోని ఒక ఇంట్లో సోమవారం రూ.47లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఇంతవరకు రూ.7.1 కోట్ల నగదు రికవరీ అయ్యింది. మిగిలిన రూ.10లక్షలకోసం దర్యాప్తు కొనసాగుతోంది.

నందిని నెయ్యికి అంతర్జాతీయ గుర్తింపు



నందిని నెయ్యి బాటిళ్లను ప్రదర్శిస్తున్న సీఎం

● మూడు దేశాలకు ఎగుమతి గర్వకారణం: సీఎం

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బ్రాండ్ నందిని నెయ్యికి డిమాండ్ పెరిగిందని, అమెరికా, ఆస్ట్రేలియా, సౌది అరేబియా దేశాలకు ఎగుమతి అవుతోందని దీంతో అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని సీఎం సిద్దరామయ్య హర్షం వ్యక్తం చేశారు. కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్) ఉత్పత్తి చేసే నందిని బ్రాండ్‌కు దేశంలోనే కాక విదేశాల్లోనూ డిమాండ్ ఉందని ఇందుకు నాణ్యత పాటించడమే కారణం అన్నారు. మంగళవారం కావేరిలో ఆయన మీడియాతో మాట్లాడారు. మైసూరు జిల్లాకు చెందిన కుమార్ అనే వ్యక్తి అమెరికాలో ఉంటున్నారని ఆయనే అక్కడ ఏజెన్సీ పొందారన్నారు. కాగా ఎమ్మెల్యేల బృందం ఢిల్లీకి వెళ్లడంపై మాట్లాడుతూ హైకమాండ్‌ను భేటీ అయి వారి అభిప్రాయం వ్యక్తం చేసే స్వాతంత్ర్యం ఉందన్నారు. అధిష్ఠానం పెద్దలు ఏం చెబుతారో వేచి చూస్తామన్నారు. గందరగోళానికి తెరదించుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణను అధిష్ఠానం పెద్దలు సూచించినప్పుడు చేపడతామన్నారు. రాహుల్‌గాంధీతో ప్రస్తుతానికి భేటీ లేదన్నారు. అంతకుముందు తొలిసారిగా విదేశాలకు ఎగుమతి చేస్తున్న నందిని నెయ్యి వాహనానికి పచ్చజెండా చూపా రు. కార్యక్రమంలో మంత్రులు కే వెంకటేశ్, లక్ష్మీహెబ్బాళ్కర్, కేఎంఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బేకరీలు, మాంసం దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● 23 మందికి నోటీసులు



యజమానికి నోటీసు అందజేస్తున్న అధికారులు

ముళబాగిలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆహార సురక్షత, ఔషధ పాలకశాఖ, నగరసభ, పట్టణ పోలీసుల సహకారంతో ముళబాగిలు నగరసభ పరిధిలోని దుకాణాలను మంగళవారం అకస్మిక తనిఖీ చేశారు. బేకరీలు, మాంసం దుకాణాలు, హోటళ్లు, వేరుశనగ గింజల మిల్లులపైనా, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గోడౌన్లను పరిశీలించారు. సుమారు 100 దుకాణాలలో తనిఖీ చేశారు. ఆహార నాణ్యత సంరక్షణపై అవగామన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన 22 దుకాణదారులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. ఇలా రూ.20వేల జరిమానా విధించారు. ఫుడ్ సేఫ్టీ, ఔషధ నియంత్రణ అధికారి డాక్టర్ రాకేశ్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సుగుణ, నగరసభ పర్యావరణ ఇంజనీర్, మహేశ్, నగరసభ ఆరోగ్య అధికారులు ప్రతిభా, అమృత, పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

గ్రామాలకు ముప్పు..!

● మేకెదాటుతో వేలాది ఎకరాలకు ముంపు గండం

● నగరానికి నీరు సరే.. భూమి కోల్పోయే పల్లెలపైనే చర్చ ● 5 గ్రామాల్లో 1079 హెక్టార్లు కోల్పోయే అవకాశం

బెంగళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా రామనగర జిల్లా కనకపుర తాలూకాలో మేకెదాటు ప్రాంతంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేపట్టాలనే ప్రతిపాదన ఎంతోకాలంగా ఉంది. ఇటీవల సుప్రీం కోర్టు తమిళనాడు పిటిషన్ కొట్టివేయడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. అయితే అసలు సమస్య ఇక్కడే మొదలయ్యింది. ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా భూమి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి 4,996 హెక్టార్ల ప్రదేశం ముంపు కానుంది. ఇందులో 4,716 హెక్టార్లు అటవీప్రదేశమే ఉంది. అందులోనూ 2,800 హెక్టార్లు కావేరి అభయారణ్యానికి చెందింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టుకు ఎలాంటి చర్యలు చేపట్టాలని భావించింది. ఈ తరుణంలో మండ్య, చామరాజనగర జిల్లాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ప్రాజెక్టు వేగిరం చేసేందుకు కార్యాచరణ వేగిరం చేయాలని పాలకులు సూచించారు. ఇందులో ప్రత్యేకించి మండ్య జిల్లాలోని ఐదు గ్రామాల్లో 1,079 హెక్టార్లుగా ఉంది. మండ్యజిల్లా అధికారి కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను సమీక్షించారు.

తీరనున్న నగర నీటి సమస్య

మేకెదాటు ప్రాజెక్టు ద్వారా బెంగళూరు నగరానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు 400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అయితే ఈ ప్రాజెక్టుకు తమిళనాడు ప్రభుత్వం పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో అమలులో జాప్యం అవుతోంది. రాష్ట్రానికి కేటాయించిన కావేరి నీటి వాటాను సమగ్రంగా వినియోగించుకునే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. సముద్ర పాలవుతున్న వృథా నీటిని సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించారు. మేకెదాటు ప్రాంతం తమిళనాడుకు సరిహద్దులో ఉంది. ఇటీవలే తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యంతరాలను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో రివైజ్డ్ డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. మేకెదాటు పథకం అమలుకు రూ.9వేల కోట్లు అవసరం కానుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు కావేరి ట్రిబ్యునల్ తీర్పులో కర్ణాటకకు కేటాయించిన నీటి పరిమితిలోపలే రూపొందించారు. ఒంటికూడ్లు అటవీప్రాంతంలో మేకెదాటు ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించింది. ఇక్కడనుంచి సంగమ మూడు కిలోమీటర్ల దూరంలో ఉండగా, మేకెదాటు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ నుంచి 2 కిమీ దూరంలో తమిళనాడు సరిహద్దు రానుంది.

4,996 హెక్టార్ల అటవీ ప్రాంతం ముంపే..

మేకెదాటు జలాశయం నిర్మాణానికి వేలాది హెక్టార్ల అటవీప్రాంతం ముంపు కానుంది. అందుకు ప్రత్యామ్నాయంగా అంతే ప్రమాణంతో అడవిని విస్తరింపచేసేందుకు ఇప్పటికే కార్యాచరణ సాగుతోంది. జలాశయం కోసం 4,996 హెక్టార్ల ప్రదేశం ముంపు కానుంది. ఇందులో 4,716 హెక్టార్లు అటవీప్రదేశమే ఉంది. అందులోనూ 2,800 హెక్టార్లు కావేరి అభయారణ్యానికి చెందింది. ముంపునకు గురయ్యే భూమిలో 95శాతం భూమి అటవీ ప్రాంతమే అయినందున ప్రాజెక్టుకు అనుమతులు లభించడం జాప్యమైంది. కనకపుర తాలూకాలో 2,500 హెక్టార్లు, మండ్య జిల్లా ముత్తత్తి అటవీప్రాంతం, చామరాజనగర హనూరు ఫారెస్టు డివిజన్‌తో కలిపి 2,200 హెక్టార్ల అడవి ముంపునకు గురి కానుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా బెంగళూరు దక్షిణ జిల్లాలో 2,500 హెక్టార్ల ప్రభుత్వ భూమిని జిల్లా యంత్రాంగం అటవీశాఖకు అప్పగించనుంది. ఇప్పటికే 30 ప్రదేశాలలో స్థలాలను గుర్తించారు. ప్రాజెక్టు పరిధికి అనుబంధమైన మండ్య, చామరాజనగర జిల్లాల్లోనూ ఇదే తరహాలోనే రెవెన్యూశాఖ ముంపునకు గురయ్యేంతటి భూమిని ప్రత్యామ్నాయంగా అటవీశాఖకు కేటాయించాల్సి ఉంది. ఇలా పొందిన భూమిలో వన్యసంపదను పెంచే ప్రక్రియ అటవీశాఖ చేయనుంది. మండ్య జిల్లాలో 2వేలు, చామరాజనగర జిల్లా పరిధిలో వెయ్యి హెక్టార్ల భూమి అటవీశాఖకు లభించే అవకాశం ఉంది.

● ప్రాజెక్టుకోసం మండ్య జిల్లాలో 1079 హెక్టార్లు అవసరం కానుందని జిల్లా అధికారి డాక్టర్ కుమార తెలిపారు. మండ్య జిల్లాధికారి కార్యాలయం సభాంగణంలో మేకెదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, తాగునీటి పథకం అమలుకు సంబంధించి సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేకెదాటు పథకం అమలుకు మళవళ్ళి తాలూకాలో 5 గ్రామాలలో 1079 హెక్టార్ల అటవీప్రాంతం ముంపునకు గురి కానుందన్నారు.

1.2 నిష్పత్తితో అటవీశాఖకు..

ముంపునకు గురయ్యే భూమికి బదులుగా 1:2 నిష్పత్తిన 2,204 హెక్టార్లను అటవీశాఖకు ఇచ్చేలా స్థలాన్ని గుర్తించామన్నారు. గతంలో గుర్తించిన 2,204 హెక్టార్లను తీసుకోవడం లేదన్నారు. అటవీశాఖకు 1:1 నిష్పత్తిన 1079 హెక్టార్లను అటవీయేతర స్థలం గోమాళ, ప్రభుత్వ స్థలాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

15 రోజులకోసారి సమావేశం

మేకెదాటు ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించడంతో 15రోజులకోసారి ఉపముఖ్యమంత్రి నేతృత్వంలో సమావేశం ఉంటుందన్నారు. ఇప్పటికే పాండవపుర, నాగమంగలలో 307 హెక్టార్లను గుర్తించామని, అటవీశాఖకు కూడా సదరు స్థలాన్ని కేటాయిస్తూ ప్రమాణపత్రాన్ని అందచేశామన్నారు. ఇక మిగిలిన 757 హెక్టార్లను గుర్తించి అటవీశాఖకు ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారులు తాలూకాలవారీగా బృందాలను ఏర్పాటు చేస్తామని సదరు 757 హెక్టార్లను గుర్తించి 15రోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

● తాలూకా స్థాయిలో తహసీల్దార్, ఏసీఎఫ్, ఏడీఎల్ఆర్, కావేరి నీరావరి నిగమ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుందన్నారు. అటవీయేతర స్థలాన్ని గుర్తించేవేళ సదరు స్థలం ఎలాంటి అక్రమ సక్రమగా ఉండరాదన్నారు. అధికారులు గుర్తించిన స్థలం సర్వే, స్కెచ్ తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండ్య ఉపవిభాగాధికారి ఎం శివమూర్తి, కావేరి నీరావరి మండలి అధికారి ఇంజనీర్ కే రఘురామన్, అటవీశాఖ డీఎఫ్ఓ రఘు, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మేకెదాటు పరీవాహక ప్రాంతం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముళబాగిలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల ధర్మాధికారి, పద్మభూషణ్ గ్రహీత డీ వీరేంద్రహెగ్డే పుట్టినరోజును పురస్కరించుకుని ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆలయాలలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయం, దొడ్డగుర్కి వెంకటరమణస్వామి ఆలయం, పద్మఘట్టె ఆంజనేయస్వామి ఆలయం, వమ్మసంద్ర గంగమ్మ ఆలయాలలో విశేషపూజలు చేయించారు. అనంతరం కాంతరాజ్ సర్కిల్‌లోని ఆశాకిరణ బుద్ధిమాంద్యం పాఠశాలలో అన్నదానం నిర్వహించారు. కర్ణాటక మామిడి అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు ఎంకే వాసుదేవ్, జిల్లా జనజాగృతి సమితి సభ్యులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో ధర్మస్థల సభ్యులు

20 రోజుల్లో మూడుసార్లు ఆపరేషన్

● అయినా ఫలితం శూన్యం ● చికిత్స ఫలించక బాలుడి మృతి
● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని విమ్స్ ముందు బంధువుల ఆందోళన



అరుణ్ (ఫైల్)

బళ్లారి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విమ్స్ ఆస్పత్రిలో చికిత్స ఫలించక బాలుడు మృతి చెందడంపై కుటుంబ సభ్యులు ఆవేదన ఆందోళన చేపట్టారు. బళ్లారి నగర సమీపంలోని ఆంద్రాలు గ్రామానికి చెందిన రవి , శాంతదంపతుల కుమారుడు అరుణ్(8) తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ 20 రోజుల క్రితం విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అపెండిసైటీస్ ఉందని అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ చేసిన రెండు రోజుల తర్వాత బాలుడిని డిశ్చార్జ్ చేశారు. తర్వాత బాలుడి ఆరోగ్యం క్షీణించడంతో 20రోజుల వ్యవధిలో మూడు సార్లు శస్త్రచికిత్స చేశారు. అయినా అనారోగ్యంతో సోమవారం బాలుడు ఇంట్లో మృతి చెందాడు. వైద్యులు సరిగా ఆపరేషన్ చేయకపోవడంతోనే బాలుడు మృతి చెందాడని బంధువులు సోమవారం ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు.

అపెండిక్స్ పగిలిపోయింది: వైద్యులు

అయితే అరుణ్‌ను మెదటి సారి ఆసుపత్రికి తీసుకువచ్చినప్పుడే అతని అపెండిక్స్ చీలిపోయి చీముతో నిండిపోయిందని అందుకే బాలుడు మృతి చెందాడని వైద్యులు పేర్కొంటున్నారు. తీవ్రమైన సెప్టిక్ షాక్ కారణంగా ఇలా జరిగిందని పీడియాట్రిక్ సర్జరీ విభాగ వైద్యులు అంటున్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని విమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ అన్నారు.

వేసవిలోనూ రైతులకు ఏడు గంటల విద్యుత్

● సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి కేజే జార్జ్ హామీ ● రాష్ట్రంలో కరెంట్ కష్టాలు తగ్గుతున్నాయన్న మంత్రి

బళ్లారి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలోనూ కోతలు లేకుండా రైతులకు ఏడు గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్ హామీ ఇచ్చారు. కుసుమ్ బి, సీ అనే స్కీమ్కు అమలు చేస్తుండడం వల్ల విద్యుత్తు ఉత్పత్తి పెరుగుతుందని, దీంతో కరెంట్ కష్టాలు తీరనున్నాయన్నారు. మంగళవారం విజయనగర(హొస్పేట్) జిల్లాలో నూతనంగా నిర్మించిన విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే కొత్త విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. హొస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప, ఎంపీ తూకారాం , ఎమ్మెల్యే శ్రీనివాసులు తదితరులు ఇందులో పాల్గొన్నారు. బైలువద్దిగిరి వద్ద కర్ణాటక విద్యుత్ సంస్థ లిమిటెడ్ రూ. 9, 28 కోట్లతో కొత్తగా నిర్మించిన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. హొస్పేట్ పట్టణంలో 11 కేవీ నాగేనహళ్లిలో 11 కేవీ నరసింహగిరి 66 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మానానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల పన్నుల డబ్బులను ఉపయోగించి సామాన్యుల కోసం ప్రజాఅనుకూల పథకాలను అమలు చేస్తుందన్నారు. కొవిడ్ సమయంలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. తరువాత నెలరోజుల వ్యవధిలోనే విద్యుత్ కొరత లేకుండా చేశామన్నారు. రాష్ట్రంలో రైతుల వ్యవసాయ పంపుసెట్లకు రూ.20 కోట్ల సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. రైతులకు ఇస్తున్న విద్యుత్ వల్ల ప్రభుత్వానికి ఎటువంటి నష్టం లేదన్నారు. ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్ ప్రారంభించడం హర్షణీయమన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో పాటు ఎంపీ తుకారాం, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్‌టీ శ్రీనివాసులు, హరపనహల్లి ఎమ్మెల్యే ఎంపీ లత మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేజే జార్జ్.. చిత్రంలో ఎమ్మెల్యే గవియప్ప, ఎంపీ తుకారాం తదితరులు

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి
● కలెక్టర్ ఆనంద్


ప్రతిభ కనబరచిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వారసత్వ కట్టడాలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిరక్షించుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పురావస్తు ప్రదర్శన శాలలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి కలెక్టర్ ఆనంద్ హాజరై, మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నెలకోమారు ఏదో ఒకచోట నిర్వహించాలనీ, తద్వారా పిల్లలు, ప్రజలకు దేశ సంస్కృతి, వారసత్వం గురించి అవగాహన వస్తుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, వంటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురావస్తు ప్రదర్శనశాలల శాఖ ఏడీ స్వామినాయక్, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, డిస్కవర్ అనిల్‌కుమార్, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణరెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ జయంతి, జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 18 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

తిప్పేసిన రాజేష్
ఆరు వికెట్లతో ఒడిశా నడ్డి విరిచిన ఆంధ్రా కెప్టెన్
ఆతిథ్య జట్టు ఘనవిజయం... చివరిరోజు బౌలర్ల హవా


వీరారెడ్డి


రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా కెప్టెన్ రాజేష్ స్పిన్ ఉచ్చులో చిక్కి ఒడిశా బ్యాటర్లు విలవిల్లాడారు. రాజేష్ 45 పరుగులిచ్చి 6 వికెట్లు కూల్చడంతో ఒడిశా రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే కుప్పకూలింది. ఆతిథ్య ఆంధ్రా జట్టు ఘన విజయం సాధించింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీసీసీఐ కూచ్ బెహర్ క్రికెట్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ మ్యాచ్ మూడోరోజైన మంగళవారం ఆంధ్రా బౌలర్లు చెలరేగిపోయారు. ఆంధ్రా జట్టు ఓవర్‌నైట్ స్కోరు 46-2తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 94.2 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 215 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. లోకల్‌బాయ్ వీరారెడ్డి హాఫ్ సెంచరీ (77)తో రాణించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా 94.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. ఒడిశా 63.1 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. 374 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా 54.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా కెప్టెన్ రాజేష్ 6, ఏఎన్‌వీ లోహిత్ 3 వికెట్లు పడగొట్టారు. దీంతో ఆంధ్రా 253 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

ఆంధ్రా టీ20 జట్టుకు వినయ్‌కుమార్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ టీ20 జట్టులో జిల్లాకు చెందిన వినయ్‌కుమార్‌కు చోటు దక్కింది. రాష్ట్ర జట్టును మంగళవారం ప్రకటించారు. లక్నోలో ఈనెల 26వతేదీ నుంచి నిర్వహించే బీసీసీఐ సీనియర్ సయ్యద్ ముస్తాక్ ఆలీ టోర్నీలో ఆంధ్రా జట్టుకు వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

ధర్మవరం కుర్రాడు అదుర్స్
అంతర్జాతీయ చెస్ టైటిల్ కైవసం



సహృద్‌కి ట్రోఫీ అందజేస్తున్న రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన సహృద్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో సత్తాచాటాడు. ఏకంగా టైటిల్‌నే కైవసం చేసుకున్నాడు. ఫణికుమార్, దీప్తి దంపతుల కుమారుడైన సహృద్ ఏడో తరగతి చదువుతున్నాడు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో 800 మందికిపైగా క్రీడాకారులు పోటీపడ్డారు. అందులో సహృద్ 1800బి రేటింగ్ విభాగంలో 9 రౌండ్లకుగాను ఎనిమిదింటిలో గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నాడు. సహృద్‌ను చీఫ్ కోచ్ ఆదిరత్న కుమార్ అభినందించారు.

హాకీలో అనంత జట్ల సత్తా



బాలికల హాకీ జట్టును అభినందిస్తున్న డీఈఓ, ఏడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి హాకీ అండర్-14 చాంపియన్‌షిప్‌లో అనంత జట్లు సత్తాచాటాయి. చంద్రగిరిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల్లో మాన్య, శ్రీలేఖ, ప్రియాంక, బాలురలో ఉదయ్‌కుమార్, విక్కీ రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. నక్కపల్లిలో నిర్వహించిన అండర్-19 హాకీ టోర్నీలో బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వైష్ణవి, జయశ్రీ బాలికల రాష్ట్ర జట్టుకు, అభిషేక్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అనంత బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. బాలికల్లో భానుశ్రీ, ఆయుష, బాలురలో వన్నూరుస్వామి రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. కర్నూలులో నిర్వహించిన రగ్బీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల్లో లాస్యప్రియ, వీరనారమ్మ, బాలుర జట్టు నుంచి నవదీప్ రాష్ట్ర జట్లలో చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్‌బాషా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, పీడీలు రాగేష్‌బాబు, నాగరాజు, అంజనాబాయి, సునీత పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ చేయండి
-ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ ద్వారా రైతులు నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యవర్తులు, దళారులను నమి డబ్బు చెల్లించరాదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కల నిజమాయెగా..!
మడకశిర రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం
పెనుకొండలోకి గోరంట్ల, పుట్టపర్తిలోకి అమడగూరు
మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ఓకే చెప్పిన సీఎం


మడకశిర రెవెన్యూ కార్యాలయం

పుట్టపర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో మడకశిర ప్రజల చిరకాల వాంఛ.. 'మడకశిర రెవెన్యూ డివిజన్' నెరవేరడం ఖాయమైంది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రి వర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులలో మడకశిర రెవెన్యూ డివిజన్‌కు చోటు దక్కింది. దీనిపై అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ క్రమంలో జిల్లాలో అతి పెద్ద రెవెన్యూ డివిజనగా ఉన్న పెనుకొండ నుంచి మడకశిర విడిపోనుంది.

పట్టించుకోని వైసీపీ..

వైసీపీ హయాంలో 2022లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, ప్రజలు ఆందోళన చేశారు. కానీ నాటి ప్రభుత్వం స్పందించలేదు. గోరంట్ల మినహా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకర్గాలను కలిపి పెనుకొండ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో మడకశిర ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది ఆగస్టులో సీఎం చంద్రబాబు గుండుమలలో పర్యటించారు. ఆ సమయంలో రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. జిల్లాల పునర్విభజనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పడాక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సహా పలువురు టీడీపీ నాయకులు వినతి పత్రాలను సమర్పించారు. ఇలా.. ప్రజల ఆకాంక్ష నెరవేరుతోంది.

ఇవే మార్పులు..

మడకశిర నియోజకవర్గంలోని అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల, మడకశిర మండలాలతో ప్రత్యేక రెవెన్యూ డివిజన్ అవతరిస్తోంది. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోకి చేరుస్తారు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. తాజా మార్పులతో పెనుకొండ, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లలో ఆయా నియోజకవర్గాల్లో అన్ని మండలాలు చేరుతాయి. దీనివల్ల పరిపాలనా సౌలభ్యం కలుగుతుంది. పరిపాలన, భౌగోళిక, సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేలా మార్పులు చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాప్రమాణాల పెంపు దిశగా..
రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు
1 నుంచి 5 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ పేరుతో పరీక్ష
డైట్ విద్యార్థుల సహకారంతో యాప్ ద్వారా టెస్ట్


పెద్దపప్పూరు మండలం జూటూరు ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ పరీక్షను పర్యవేక్షిస్తున్న డైట్ లెక్చరర్లు

అనంతపురం విద్య, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల్లో 60, 70 శాతం మందికి చదవడం, రాయడం రావడంలేదని, కనీసం అంకెలు కూడా గుర్తించలేక పోతున్నారని ఇటీవల కేంద్రం ఓ సంస్థతో నిర్వహించిన సర్వేలో తేలింది. ఆ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కేంద్రం తెచ్చింది. దీంతో ప్రాథమిక స్థాయిలో కూడా విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందుకోసం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ)పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.

1427 పాఠశాలలు.. 83,877మంది విద్యార్థులకు పరీక్ష

ఎఫ్ఎల్ఎన్ పేరుతో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులు అక్షరాలను గుర్తించడం, చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు కలిగి ఉండాలి. అలాగే ప్రాథమిక గణిత ప్రక్రియలు, సంఖ్యలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు ఏమేరకు ఉన్నాయో తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలో 135 క్లస్టర్స్ ఉండగా, ఈపరిధిలో 1427 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యాశాఖ రికార్డుల మేరకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 83,877మంది చదువుతున్నారు. వీరందరికి సోమవారం నుంచి ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు మొదలు పెట్టారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో డీఎడ్ విద్యార్థిని నియమించి వారిద్వారానే ఈపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి పక్షపాతానికి అవకాశం లేకుండా లీప్‌యాప్‌లో రాష్ట్ర స్థాయిలోనే ప్రశ్నాపత్రం రూపొందించి, పొందుపరిచారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో ఒక్కోదానికి 16మార్కులకు ప్రశ్నాపత్రం తయారు చేసి పిల్లలను టెస్ట్ చేస్తున్నారు. డీఈఓ ప్రసాద్ బాబు, డైట్ ప్రిన్సిపాల్, డైట్‌లెక్చరర్ల పర్యవేక్షణలో ఈఎఫ్ఎల్ఎన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారంలో 129 క్లస్టర్ల పరిధిలో 1797ప్రాథమికపాఠశాలలో 54,681మందివిద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు పూర్తి చేశామని, ఈనెల 28లోగా అందరికీ పరీక్షలు పూర్తి చేస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు
4.250 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, సిబ్బంది

అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఏడుగురు నిందితులను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచీ 4.25 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, రూ.2700 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. బెళుగుప్పకు చెందిన మనోజ్ కుమార్, అనంతపురంలో ఆరో రోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం బాషా అలియాస్ బబ్లూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. గంజాయి కొనేందుకు సులువుగా డబ్బు సంపాదించాలని హాజీ రహమత్ అలియాస్ కురుగుంట బువ్వమ్మతో పరిచయం పెంచుకున్నారు. ఈ ముగ్గురూ మూడో రోడ్డు ప్రాంతంలో ఉండే రవికుమార్ అలియాస్ పాషి, టీవీ టవర్ ప్రాంతానికి చెందిన ఏలూరు సాలోమన్ అలియాస్ మురళి, తపోవనానికి చెందిన జ్యోతుల ప్రవీణ్‌కుమార్ అలియాస్ లడ్డూ, కళ్యాణదుర్గం బైపాస్ వాసి దినేష్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ముతో తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే మనోజ్, అస్లాంబాషా, బువ్వమ్మ ఇటీవల విశాఖపట్నం జిల్లా తునికి వెళ్లి.. అక్కడ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద 10 కేజీల గంజాయి కొన్నారు. రైలులో అనంతపురం తీసుకొచ్చారు. అందులో 4 కేజీల గంజాయిని కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి తీసుకెళ్లి కేజీ రూ.18 వేలకు విక్రయించారు. తర్వాత మరో 1.25 కేజీల గంజాయికి 100 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.2 వేలకు అనంతపురం నగర పరిసరాల్లో విక్రయించారు. మిగిలిన 4.25 కేజీల గంజాయిని అమ్ముకోడానికి అనంతపురం నగర పరిసర ప్రాంతమైన రాజీవ్ కాలనీ వద్ద నాగులకట్ట సమీపంలో పంచుకుంటుండగా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు, బైక్, నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా భూములను ఆక్రమించారు..!
ప్రైవేటు కంపెనీ వద్ద రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, నాయకులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెరువు కింద ఉన్న తమ పట్టా భూములను ప్రైవేటు కంపెనీవారు ఆక్రమించారని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. కంపెనీ ఎదుట మంగళవారం బైఠాయించారు. బాధితులు తెలిపిన మేరకు, న్యామద్దల చెరువు ఆయకట్టు సర్వే నంబరు 177-1లో నిలేష్ కుమార్, ఉమేశ్వరి, ఎర్రమ్మకు 46 సెంట్లు, సర్వేనంబరు 195లో అహోబిళప్పకు 35 సెంట్ల భూమి ఉంది. హనుమే నాయక్‌కు సర్వే నంబరు 177-1లో ఎకరం, సర్వే నంబరు 192లో 30 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్నామని రైతులు అంటున్నారు. ఆయకట్టు పరిధిలో ఏర్పాటైన ఓ ప్రైవేటు కంపెనీ తమ భూములను ఆక్రమించిందని వాపోయారు. దీని గురించి ప్రశ్నిస్తే.. న్యాయం చేస్తామని చెబుతూ కంపెనీ ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీంతో సర్వే చేసి తమ భూములను గుర్తించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు విన్నవించామని తెలిపారు. సర్వే చేసేందుకు అధికారులు మంగళవారం వచ్చారని, కంపెనీ నిర్వాహకులు వారిని లోనికి అనుమతించలేదని, దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారని అన్నారు. సీపీఐ మండల నాయకుడు ముత్యాలప్పతో కలిసి వారు ఆందోళనకు దిగారు. కంపెనీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, పార్టీ నాయకులు అక్కడికి వెళ్లి విచారించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ల్యాబ్ నిర్వహణపై శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణపై మూడ్రోజులు నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ ఆఫీసర్ బాలమురళి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లా సైన్స్‌సెంటర్‌లో బుధవారం నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఉంటుందన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాలన్నారు.

పాపను తీసుకెళ్లండి
ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి



అనంతపురం వైద్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శిశుగృహంలో సంరక్షణ పొందుతున్న 60రోజుల చిన్నారిని సబంధిత తల్లిదండ్రు, రక్తసంబంధీకులు తగిన ఆధారాలు సమర్పించి తీసుకెళ్లవచ్చునని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండు నెలల క్రితం నగరంలోని సాయినగర్ 7వ క్రాస్‌లో నవజాత శిశువు(అమ్మాయి)ను వదిలేసి వెళ్లిపోయారన్నారు. సమాచారముందుకు వైద్యపరీక్షలు చేయించి శిశుగృహలో సంరక్షించడం జరుగుతోందన్నారు. అమ్మాయికి సంబంధిత తల్లిదండ్రులకు, రక్తసంబంధీకులు 30రోజులలోపు రాకపోతే నిబంధనల మేరకు అనాథగ ప్రకటిస్తామన్నారు. అనంతరం దత్తకోరు తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. వివరాలకు ఐడీసీఎస్ పీడీ కార్యాయాన్ని సంప్రదించాలని కోరారు.

41 దరఖాస్తులు..

మహిళ, శిశు శాఖ ఆధ్వర్యంలో సఖి(వన్‌స్టాప్) సెంటర్‌లోని పోస్టులకు 41 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 15నుంచి 25వ తేదీ వరకు ఫిజియో సోషల్ కౌన్సిలర్‌కు ఏడు, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్‌కు 11, సెక్యూరిటీ గార్డ్/ నైట్‌వాచ్‌మెన్‌కు 23 మొత్తం 41మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఎంపిక స్క్రూటినీ తదితర వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)-2026పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడీటీలు, ఈఎస్ఏఎస్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మలోల మాట్లాడుతూ... 2002 ఓటరు జాబితా ప్రకారం 2025 ఓటర్ లిస్ట్‌లో వారి వారసులతో మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ పూర్తి చేయడంపై పలు సూచనలు ఇచ్చారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడీటీలు, ఈఎస్ఏఎస్‌లు తమ నియోజకవర్గాల్లో బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఎస్ఈగా సంజీవరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) విభాగం అనంతపురం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)గా సంజీవరాయుడును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి క్రిష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్ విభాగంలోనే విజయవాడలో ఈఈగా పనిచేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఈఈ సుధాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇయన కూడా నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో రెగ్యులర్ ఎస్ఈని నియమించారు.

ఈఈగా సిద్దారెడ్డి..?

సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణతో ఖాళీ పడనున్న ఈఈ స్థానానికి కర్నూలు ఎస్ఈ టూ పీఏగా ఉన్న సిద్దారెడ్డిని నియమించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ ఆర్అండ్‌బీ ఈఈగా పనిచేసిన రాజగోపాల్ సైతం ఎన్‌హెచ్ ఈఈ స్థానం కోసం ప్రయత్నం చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆయననే నియమిస్తారని కూడా చర్చ జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు.. ఆర్అండ్‌బీలోనే ఉండాలని సూచించడంతో ఆయన ప్రయత్నాలు విరమించుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత సిద్దారెడ్డి రాకపై ప్రచారం ఊపందుకుంది. మరో అధికారి కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

పేలిన పెయింట్ డబ్బా
ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెయింట్ డబ్బా పేలి ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడిన సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమలేశ్, కేతన్‌లాల్ కుటుంబాలతో కలిసి ఆరేళ్ల కిందట ధర్మవరం వచ్చారు. పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ సమీపంలో రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని షోకేస్‌లో ఉంచుకునే బొమ్మలు తయారు చేసి, విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో కమలేశ్ మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుడారం సమీపంలో చెత్తకు నిప్పుపెట్టాడు. అయితే దాని కింద బొమ్మల తయారీకి వాడే పెయింట్ డబ్బా ఉండటం గమనించలేదు. దీంతో వేడికి డబ్బా పేలింది. దీంతో కమలేశ్ అరచేయి ఛిద్రమైంది. కళ్లకు గాయాలు అయ్యాయి. సమీపంలో ఉన్న కేతన్‌లాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పట్టణానికి చెందిన అశోక్‌కుమార్ కూడా స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వెబ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, పర్యాటకం, హాస్పిటాలటీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 9966682246 నంబరులో సంప్రదించాలన్నారు.

జవాబుదారీతనంతో కాంగ్రెస్ నిర్మాణం
ఏఐసీసీ పరిశీలకులు పరమేశ్వర నాయక్



మాట్లాడుతున్న పరమేశ్వర నాయక్

అనంతపురం వైద్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బలమైన, జవాబుదారీతనంతో ప్రజలకు అనుసంధానంగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కావాలని ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరమేశ్వర నాయక్ మాట్లాడుతూ పార్టీ పునర్నిర్మాణం చేయడానికి సంఘటన్ సృజన్ అభియాన్(ఎస్ఎస్ఏ)ను రాహుల్ గాంధీ చేపట్టారన్నారు. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ సిద్ధాంతాల్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ పరిశీలకులు అల్లాబకాష్, మహమ్మద్, అలీఖాన్, అంబటి రామకృష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు
కుర్చీలతో దాడులకు యత్నం


కుర్చీలతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

మడకశిరటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ వైసీపీలో వర్గపోరు భగ్గుమంది. పట్టణంలో మంగళవారం జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రెండు వర్గాల నాయకులు పరస్పరం దాడులకు యత్నించారు. గత నెలలో రొళ్ల ఎంపీపీపై సొంత పార్టీలోనే ఒక వర్గానికి చెందిన నాయకులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధిష్ఠానం వద్దన్నా పంతం పట్టి అవిశ్వాసాన్ని నెగ్గించారు. దీంతో రొళ్లలో వైసీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ తమ పదవులు కోల్పోయారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం మడకశిరలో వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా రొళ్ల ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై చర్చ లేపారు. ఒక వర్గానికి చెందిన వారు టీడీపీలోకి వెళ్లాలని ప్రోత్సహించారంటూ ఆరోపణలు చేసుకోసాగారు. ఈసమయంలోనే వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఈక్రమంలో ఇరువర్గాల వారు చెయిర్‌లు తీసుకుని దాడులకు దిగారు. దీంతో అక్కడ ఉన్న కొందరు నాయకులు సర్దిచెప్పి సమావేశాన్ని కొనసాగించారు. వైసీపీలో నెలకొన్న ఈ వర్గపోరు భరించలేక అనేకమంది తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారు.

ఒకేసారి ఒకే రకం పంట వేయవద్దు
రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులంతా ఒకేసారి ఒకే రకం పంట సాగుచేస్తే గిట్టుబాటు ధరలేక నష్టాలు వస్తున్నాయనీ, ఈ పద్ధతిని విడనాడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మామిళ్లపల్లిలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రైతన్నల ఇళ్ల వద్దకే వెళ్లి 'అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా' అని ఆరాతీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన కరపత్రాన్ని అందజేశారు. అనంతరం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో సమావేశమై పంటల సాగుపై చర్చించారు. రైతులంతా ఒకేరకం పంట, ఒకే సీజన్‌లో సాగుచేయడం ద్వారా దిగుబడులు అధికమై ధరలు తగ్గి నష్టపోతారన్నారు. వేర్వేరు పంటలు పెట్టుకోవాలన్నారు. ఎప్పుడు, ఏ పంటలు సాగుచేయాలి, తెగుళ్ల నివారణకు ఎటువంటి మందులు పిచికారీ చేయాలన్న అంశాలపై రైతులకు అధికారులు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కిష్టయ్య, ఏఓ మాధురి, డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్లు నెట్టెం వెంకటేష్, బోయపాటి సుధాకర్ చౌదరి, కన్వీనర్ పోతులయ్య, మాజీ నాయకులు పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఛార్లెస్ స్కల్జ్ (జయంతి)



అమెరికాకు చెందిన ఛార్లెస్ మన్రో స్కల్జ్ 1922 నవంబరు 26న జన్మించారు. కార్టూనిస్ట్‌గానే కాకుండా 'క్రియేటర్ ఆఫ్ ది కామిక్ స్ట్రిప్ పీనట్స్'గా గుర్తింపు పొందారు. ఇందులోని చార్లి బ్రౌన్, స్నూపి తదితర ప్రధాన పాత్రలు ఎంతో పేరొందాయి. 75 దేశాలు 21 భాషలలో 2,600 దినపత్రికలలో 'పీనట్స్' ప్రచురితమైందంటే ఎంతగా ప్రసిద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు కొనసాగగా 17,897 బొమ్మలు గీశారు. నేషనల్ కార్టూనిస్ట్ సొసైటీచే హ్యూమర్ కామిక్ స్ట్రిప్ అవార్డు, రూబెన్ అవార్డు, మిల్టన్ కానిఫ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు పొందారు. 2000 ఫిబ్రవరి 12న కన్నుమూశారు. తుదిశ్వాస వరకు టీవీ స్పెషల్స్‌కు రాయడం లేదా సహకారం అందిస్తూ ప్రొడక్షన్స్‌ను పరిశీలించేవారు.

ప్రొఫెసర్ యశ్‌పాల్ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత యశ్‌పాల్ 1926 నవంబరు 26న పంజాబ్‌కు అనుబంధమైన ఝూంగ్ ప్రాంతంలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో) జన్మించారు. శాస్త్రవేత్త, విద్యావేత్తగా రాణించారు. కాస్మిక్ కిరణాలపై ప్రత్యేక అధ్యయనం చేశారు. సైన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీలో ఆయన అందించిన సేవలకు 1976లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో కెరీర్‌ను ప్రారంభించిన ఆయన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఛైర్మన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. యునెస్కోచే కళింగ పురస్కారం, లాల్‌బహద్దూర్‌శాస్త్రి నేషనల్ అవార్డ్, ఇందిరాగాంధీ ప్రైజ్ ఫర్ పాపులరైజేషన్ ఆఫ్ సైన్స్, ఇతరత్రా గౌరవాలు అందుకున్నారు. 2017 జూలై 24న కన్నుమూశారు.

జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్



కిత్తూరు రాణి చన్నమ్మ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

బెంగళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మన దేశం అభివృద్ధి బాటలో కొనసాగుతోందని, జాతినిర్మాణంలో యువశక్తిపాత్ర కీలకమని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, వాతావరణ విజ్ఞానం, బయో టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధనల రంగంలో ముందుకు సాగుతోంద న్నారు. రాణి చన్నమ్మ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం బెళగావిలో మంగళవారం జరిగింది. గవర్నర్ అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ ప్రస్తుతం మనదేశం ప్రతి రంగంలోనూ పురోగతి సాధిస్తోందన్నారు. విజ్ఞాన పరిశోధనలు, డిజిటలీకరణతో పాటు అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలోనే తనదైన సత్తా చాటుతోం దన్నారు. జ్ఞానం ప్రధాన ఉద్దేశ్యం సమాజ పురోగతి, మానవత్వం చాటుకోవడమేనన్నారు. బెంగళూరు నుంచి బెళగావి వరకు కొత్తదనం సాగుతోందన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో ఉన్నత హోదాలలో రాణించాలని అభిలషించారు. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, గ్రీన్ ఎనర్జీ మిషన్, స్పేస్ టెక్నాలజీ మిషన్ వంటి రంగాలలో సత్తా చాటి దేశ కీర్తిని ఇనుమడింపచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వీరవనిత కిత్తూరు రాణి చన్నమ్మ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయక మన్నారు. సమాజసేవలో రాణించిన శివాజి కగణికర్, వినోద్ దొడ్డణ్ణనవర్, బసవరాజ యలిగార్‌లకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేసి అభినందించారు. స్నాతకోత్సవంలో పద్మశ్రీ ఏఎస్ కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ సీఎం త్యాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేఐఏడీబీకి వ్యతిరేకంగా నిరసన



సమావేశంలో రైతుసంఘం నాయకులు

దొమ్మసంద్ర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళిలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలెప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) భూస్వాధీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. మంగళవారం సొళ్లెపురలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. 138 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నా పాలకులనుంచి సరైన స్పందన లేదని రైతుసంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతునాయకుడు బడగలపుర నాగేంద్ర మాట్లాడుతూ.. రక్తమైనా ఇస్తాంగానీ ఒక అంగుళం భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. ఇదే పోరాటానికి నినాదం కావాలన్నారు. సాగు భూమి పరిశ్రమల పాలైతే పంటలు పండించేది ఎలాగన్నారు. కావాలంటే మరోచోటు బంజరు భూములు తీసుకోవాలన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, సాగుభూములను బలవంతంగా రైతులనుంచి లాక్కోవడం సహించేది లేదన్నారు. పెట్టుబడిదారులకోసం రైతులను బలిచేస్తే పోరాటం తీవ్రం చేస్తామన్నారు. నిరసనలో రైతు నాయకుడు చంద్రారెడ్డి, భూస్వాధీనం వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు దేవరాజరెడ్డి, గౌరవాధ్యక్షుడు జయప్రకాశ్, జాతీయ యువ పురస్కార విజేత డాక్టర్ చిన్నప్ప వై చిక్కహాగడె, ఇతర మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తెరవండి

కర్ణాటక ప్రాంత రైతుసంఘం డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బాగేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న ధర తగ్గడంతో తాలూకా వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేసేలా కేంద్రాన్ని తెరవాలని కర్ణాటక ప్రాంత రైతుసంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు సంఘం తాలూకా సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ మనీషా ఎన్ పత్రికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఎం నాయకుడు చన్నరాయప్ప మీడియాతో మాట్లాడుతూ మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటాలుకు రూ.1500-1800 మాత్రమే ఉంటోందని దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కనీసధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరామన్నారు. మొక్కజొన్న కనీసధర రూ.2,400గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.600 అదనంగా ఇచ్చి రూ.3వేలు ప్రకటించాలన్నారు. పండించిన పంటలకు కనీసధర లభించకుంటే ఎలాగని ప్రశ్నించారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు డీ శ్రీనివాస్, రఘురామరెడ్డి, జీ కృష్ణప్ప, అశ్వత్థప్ప పాల్గొన్నారు.

రైతు సంఘానికి నూతన పదాధికారులు



మాట్లాడుతున్న రైతుసంఘం కార్యదర్శి మునిస్వామి తదితరులు

బాగేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రాంత రైతుసంఘం బాగేపల్లి తాలూకా సమ్మేళనం పట్టణంలో మూడురోజులపాటు సాగింది. సంఘానికి నూతన పదాధికారులను ఎంపిక చేశామని మూడు సంవత్సరాలపాటు కొనసాగుతారని కార్యదర్శి డీటీ మునిస్వామి తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంఘం నూతన పదాధికారుల వివరాలను ప్రకటించారు. అధ్యక్షులుగా డీసీ శ్రీనివాస్ రఘురామ్, ఉపాధ్యక్షులుగా ఆనందరెడ్డి ఎంఎన్ రఘురామరెడ్డి, ఇతర పదాధికారులుగా డీటీ మునిస్వామి, చిన్నప్పయ్య, రాము, వెంకటరామప్ప, జీ కృష్ణప్ప, నరసింహరెడ్డి, నారాయణస్వామి, చిన్నాగప్ప మూర్తి, సోమశేఖరరెడ్డి, సుధాకర, సదాశివ, వెంకటరామరెడ్డి, వెంకటరెడ్డి, నరసింహమూర్తి, వెంకట నరసప్ప, రామచంద్ర, ఆదినారాయణలు ఎంపికయ్యారన్నారు. ఇదే సందర్భంగా సమ్మేళనంలో తీర్మానించిన అంశాలను ప్రస్తావించారు.

పరుగుల దీక్ష

- జాతీయస్థాయి పోటీలకు మడకశిర విద్యార్థిని



మడకశిర టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైన గంగులవాయి పాళ్యానికి చెందిన దీక్ష పరుగు పోటీల్లో సత్తాచాటింది. ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాజు, రత్నమ్మ దంపతుల పెద్దకుమార్తె దీక్ష మడకశిర కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. గుంటూరు జిల్లా వినుకొండలో సోమవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి 800 మీటర్ల అండర్-17 పరుగు పందెంలో మూడోస్థానంలో నిలిచింది. తద్వారా జాతీయ పోటీలకు ఎంపికైందని పీఈటీ అనిత తెలిపారు. లక్నో వేదికగా త్వరలో నిర్వహించే పోటీల్లో దీక్ష పోటీపడనుంది.

నిరుపేద కుటుంబం

దీక్షది నిరుపేద కుటుంబం. ఎకరా పొలం మాత్రమే ఉంది. తండ్రి రాజు కూలి పనులకు వెళ్తుంటాడు. దీక్ష చెల్లి కూడా మడకశిర కేజీబీవీలోనే ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో రాణించానని దీక్ష తెలిపింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేసింది.

సంఘసంస్థల పేరిట అడ్డుకుంటే చర్యలు: ఎమ్మెల్యే



ప్రగతి పరిశీలన సమావేశంలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంఘాలు, సంస్థల పేరిట ప్రభుత్వ పనులకు అడ్డు తగిలితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి హెచ్చరించారు. కాగా కొంతమంది అధికారులు బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. పురసభ సభాంగణంలో ప్రగతి పరిశీలనా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు చట్టపరిధిలో విధులు నిర్వహించాలన్నారు. సంఘాలు, సంస్థల పేరిట బ్లాక్ మెయిల్ చేసినా, ప్రభుత్వ పనులకు అడ్డు తగిలినా సహించేది లేదని వారిపై చట్టరీత్యాచర్యలు తప్పవన్నారు. తాలూకాలో ఇళ్లు లేనివారికి గూడు కల్పించదలిచామన్నారు. గ్రామపంచాయతీల పరిధిలో గోమాళ భూమిని గుర్తించి అర్హులైనవారికి ఇళ్లు నిర్మించదలిచామన్నారు. ఇందుకుగాను ప్రభుత్వ భూములను గుర్తించాలని తహసీల్దార్, ఏడీఎల్ఆర్‌లకు సూచనలు చేశా మన్నారు. ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించామని ఇంకా ఎవరైనా అర్జీ సమ ర్పించవచ్చునన్నారు. కాగా తాలూకాలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ క్లినిక్‌లలో నకిలీ వైద్యులు ఉన్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే అడ్డుకట్ట వేయాలని వైద్యాధికారులకు సూచించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుజాత, గ్రేడ్-2 తహసీల్దార్ గాయత్రి, తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్, గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు పార్థసారథి, పురసభ అధ్యక్షులు గోవింద తదితరులు పాల్గొన్నారు.

మఠం దారిని బాగు చేయండి

చేళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా సోమనాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని గోగర్భగిరి మఠానికి వెళ్లే దారిని బాగు చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు. మఠానికి వెళ్లే మార్గం కంకరతేలి ఉండడంతో సంచారానికి ఇబ్బంది పడుతున్నారు. చమన్నగారిపల్లి, నక్కలపల్లి, బూడిలపల్లి గ్రామస్తులు ఈ మార్గంలో మేకలు, గొర్రెలను మేపేందుకు వెళ్లి వస్తుంటారు. దుస్థితిలో ఉన్న రోడ్డును బాగు చేసేందుకు గ్రామపంచాయతీ అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహేతర సంబంధం...

స్థానికులు చితకబాదడంతో యువకుడి మృతి



నరసింహరాజు (ఫైల్)

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళతో వివాహేతర సంబంధం కల్గిన యువకుడిని ఆమె కుటుంబీకులు చితకబాదడంతో మృతి చెందిన సంఘటన యశ్వంతపుర ముత్యాలమ్మనగర్‌లో చోటు చేసుకుంది. నరసింహరాజు (32) మృతి చెందిన వ్యక్తి. ఇతను మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. సదరు మహిళ అప్పుడప్పుడు యువకుడి ఇంటికి వచ్చి వెళ్లేది. ఈనెల 22న శనివారం మహిళ, నరసింహరాజు ఇంటికి వచ్చింది. ఇద్దరు ఉన్నారనే సమాచారంతో మహిళ బంధువులు అక్కడికి చేరుకున్నారు. నరసింహరాజును ఇంటి బయటకు రప్పించి రోడ్డుపై నలుగురైదుగురు ఇష్టం వచ్చినట్టు చితకబాదారు. విడిపించేందుకు ప్రయత్నించిన నరసింహరాజు తల్లిపై కూడా దాడి చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన నరసింహరాజును స్థానికులు కేసీ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక యువకుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఘటనపై యశ్వంతపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అలరించిన కళాప్రతిభోత్సవం



నృత్యకళాకారుల బృందంతో ప్రముఖులు

చిక్కబళ్లాపుర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశీయ కళలతో మానసిక సంతృప్తితోపాటు సామరస్యం, సోదరభావాన్ని ప్రతిబింబిస్తాయని, కావున కళలను సంరక్షించుకోవడంతోపాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనకర్తవ్యమని కర్ణాటక జానపద అధ్యక్షుడు గొల్లహళ్ళి శివప్రసాద్ పేర్కొన్నారు. కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కన్నడ భవన్‌లో ఏర్పాటైన కళా ప్రతిభోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో మానసిక సమతుల్య, ఏకాగ్రత పెంచడానికి కళలు దోహదపడతాయన్నారు. జానపద కళాకారుడు నాగరాజ్ మాట్లాడుతూ.. ఏదైనా కార్యక్రమాలలో పెద్దసం ఖ్యలో కళాకారులు, విద్యార్థులు పాల్గొనేలా చేయడం కూడా ముఖ్యమని అది ఇక్కడ జరిగిందన్నారు. సినీ గాయకుడు మోహన్‌కుమార్ ఒరిజినల్ జానపదగీతాలను ఆలపించారు. కన్నడ సంస్కృతిశాఖ సహాయ సంచాలకులు డీఎం రవికుమార్ కళా ప్రతిభోత్సవ ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రీయ నృత్యం, శాస్త్రీయగానం, శాస్త్రీయ వాయిద్యం, చిత్రలేఖనం, సంగీతం, జానపద పాటల పోటీలలో విజేతలను అభినం దించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ సభ్యుడు కేవీ నాయక్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కోడిరంగప్ప పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.49



అనంతపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.49తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 2025 టన్నుల టమోటా కాయలు వచ్చాయని వివరించారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.27, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయని వెల్లడించారు.

అప్రమత్తంగా ఉండాలి : డీసీ

చిలమత్తూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. ఆయన మంగళవారం కొడికొండ చెక్‌పోస్టులోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా తరలి వచ్చే మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను రాష్ట్రంలోకి నిషేధిత పదార్థాలు రాకూడదన్నారు. 44వ జాతీయ రహదారి కావడంతో నిరంతరంగా వాహనాల రాకపోకలు ఉంటాయని, అనుమానాస్పద వాహనాలను తనిఖీ తనిఖీ చేయాలన్నారు. వాహనాల తనిఖీ అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు.

దాసన్నకు ఇందిరా ప్రియదర్శిని ప్రకృతి పురస్కారం అందజేత

పావగడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విశ్వగ్రామోదయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కార్యదర్శి ఆర్‌డీ రొప్పం గ్రామానికి చెందిన దాసన్నకు ఇందిరా ప్రియదర్శిని పురస్కారం లభించింది. 18 సంవత్సరాలుగా మొక్కలను పెంచడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడంతో ఆయనను కర్ణాటక రాష్ట్ర ప్రకృతి కాలుష్య నియంత్రణ మండలి ఇందిరా ప్రియదర్శిని పురస్కారాన్ని అందించింది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, ఆరోగ్యమంత్రి దినేష్ గుండురావు, వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తదితరులు దాసన్నను బెంగళూరులోని జీకేవీకేలో మంగళవారం సన్మానించి పురస్కారాన్ని అందజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న దాసన్న

వెళ్లొస్తాం స్వామీ..!

- సత్యసాయి భక్తుల తిరుగు పయనం
- పుట్టపర్తి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో రద్దీ



రైల్వే స్టేషన్‌లో భక్తులు

సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చిన భక్తులు తమ స్వస్థలాలకు తిరిగి వెళుతున్నారు. దీంతో పుట్టపర్తి బస్టాండు, సత్యసాయి రైల్వే స్టేషన్ కిటకిటలాడుతున్నాయి. దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు దాదాపు రెండు వారాలపాటు వేడుకలలో పాల్గొన్నారు. మహా సమాధిని దర్శించుకున్నారు. పుట్టపర్తి పట్టణంలో సందడి చేశారు. ప్రశాంతి నిలయంలో జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను కన్నులారా వీక్షించి తన్మయత్వం చెందారు. వేడుకలు ముగియడంతో అందరూ ఖాళీచేసి, బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలలో వెళ్లిపోతున్నారు.



మునుపటి కళ

సత్యసాయి బాబా 2011, ఏప్రిల్ 24న శివైక్యం చెందారు. ఆయనను కడసారి చూసుకునేందుకు లక్షల మంది తరలివచ్చారు. ఆ తరువాత జయంతి వేడుకలు, ఆరాధనోత్సవాలకు భక్తులు వస్తున్నారు. శత జయంతి వేడుకలకు వచ్చినంతగా రాలేదు. సుమారు 14 సంవత్సరాల తరువాత మునుపటి కళ కనిపించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు, హైకోర్టు న్యాయమూర్తులు, క్రీడాకారులు, సినీతారలు.. ఇలా అందరూ వేడుకలకు తరలివచ్చారు. సత్యసాయి జయంతిని ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం, ట్రస్ట్‌తో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పుట్టపర్తికి మళ్లీ మంచి రోజులు వచ్చాయన్న ఆనందం అందరిలో కనిపిస్తోంది.

– ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,528	3,066
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,313	6,246
నీటి నిల్వ (టీఎంసీలు)	72.42	96.00

మందుబాబులకు అడ్డాగా బస్‌స్టాప్

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్మాగారాల పట్టణంగా పేరుగాంచిన కుడితిని పట్టణంలోని హోస్పేట రోడ్డులోని ఇంద్రానగర్‌లో ఉన్న బస్‌స్టాప్ ప్రయాణికులకు ఉపయోగం లేకుండా మందుబాబులకు అడ్డాగా మారింది. లక్షల వ్యయంతో బస్టాండ్ నిర్మించినా ప్రయాణికులకు కూడా ఉపయోగం లేకుండా పోయింది. ఇంద్రానగర్‌లో వేలాదికొద్ది ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారు. కానీ అక్కడ బస్టాండ్ నుండి కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడున్న ప్రజలు సుమారు ఒక కిలోమీటరుకుపైగా వెళ్లి అక్కడ వున్న బస్టాండ్ నుండి ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ విషయంపైన ఎన్నోసార్లు కేఎస్ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసిన బస్టాండ్ మాత్రం స్టాప్ ఏర్పాటు చేయలేదని అక్కడున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బస్టాప్‌లో ఉంచిన మద్యం బాటిళ్లు

గని ప్రభావిత ప్రాంత అభివృద్ధిలో నిర్లక్ష్యం తగదు

● రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంజయ్ ఎస్ బిజ్జూర్



మాట్లాడుతున్న సంజయ్ ఎస్ బిజ్జూర్

బళ్లారి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గనుల ప్రభావిత ప్రాంతాల పునరాభివృద్ధిలో నిర్లక్ష్యం వహించరాదని, ఇందులో అధికారుల భాగస్వామ్యం చాలా అవసరమని కర్ణాటక మైన్స్ ఎన్విరాన్‌మెంటల్ రిస్టోరేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఎస్.బిజ్జూర్ అన్నారు. సండూర్ తాలూకాలోని డోనిమలై ఎన్ఎండీసీ లెర్నింగ్ హాల్లో మంగళవారం నిర్వహించిన సండూర్ తాలూకాలో గనుల ప్రాంతాల పునరుజ్జీవనం, పునరావాస ప్రాజెక్టు కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం,గనుల ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల పునరాభివృద్ధి కోసం చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల అధికారులు శ్రద్ధగా ఉండి ప్రాజెక్టులను ఆలస్యం చేయకుండా అమలు చేయాలన్నారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి గ్రామాల ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. సండూర్, బళ్లారి తాలూకాలోని గనుల ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్డు అభివృద్ధి పనుల కోసం జరుగుతున్న భూ ఆక్రమణలకు సంబంధించి ప్రతి మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తహసీల్దార్, సబ్-డివిజనల్ అధికారి సంబంధిత అధికారులు సమావేశం నిర్వహించాలని , గృహనిర్మాణానికి సంబంధించి జడ్పీ సీఈఓతో సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని గనుల ప్రభావిత తాలూకాల్లోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అనుబంధ పోషకాహారం పంపిణిని అమలు చేశామని, ఈ పథకం సక్రమంగా అమలు అయ్యేలా పర్యవేక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డీడీపీఐ , బీసీ భోజన పథకం అధికారులకు తెలియజేశారు. అనంతరం డోనిమలై ప్రభుత్వ పాఠశాలలో కేఎంఈఆర్‌సీ సీఈపీఎంఐజడ్ ప్రథకం కింద ఉన్నత పాఠశాల పిల్లలకు పప్పుధాన్యాలు అందించే అమలు కార్యక్రమాన్ని కేఎంఈఆర్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ బిజ్జూర్ పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్, జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మహ్మద్ హారీస్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో పప్పుధాన్యాలను పరిశీలిస్తున్న సంజయ్ బిజ్జూర్

పంచమశాలి సమాజ అభివృద్ధికి కృషి: ఎంపీ

బళ్లారి సిటీ,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పంచమశాలి సమాజం సమగ్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎంపీ తుకారం అన్నారు. మంగళవారం కర్ణాటక రాష్ట్ర వీరశైవ లింగాయత్ పంచమశాలి సంఘం సండూర్ తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఆదర్శ కల్యాణ మంటపంలో నిర్వహించిన కిత్తూరు రాణి చెన్నమ్మ 201 వ విజయోత్సవం 247వ జయంత్యుత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సండూరు నియోజకవర్గం చాలా సంవత్సరాలుగా రాజ్యాంగ వ్యవస్థలో తన దైన శైలిలో తాలూకాలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం , విద్య వంటి ప్రాథమిక సౌకర్యాల్లో ముందంజలో ఉందన్నారు. కిత్తూరు రాణి చెన్నమ్మ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి కిత్తూరు రాష్ట్రాన్ని కాపాడి, దేశ చరిత్రలో స్థానం సంపాదించిందన్నారు. సమాజంలో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, అన్ని రంగాల్లో సేవ చేయగల సామర్థ్యం కలిగి ఉన్నారు. సమాన సమాజాన్ని నిర్మించడానికి అందరమూ కృషి చేయాలన్నారు. సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం మాట్లాడుతూ నగరంతో సహా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఉన్నత విద్య కోసం త్వరలో కొత్త నర్సింగ్ కళాశాల ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాంతంలోని మహిళల ఆర్థిక పురోగతి కోసం ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ ముఖ్యకార్యదర్శి వియనకుమార్‌గౌడ్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బి.నాగనగౌడ్, సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్ గడద్, జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి,ఎం.శంకరప్ప, మహిళా విభాగం అధ్యక్షురాలు అరుంధతి, నాయకులు రవికుమార్, నాగరాజ్, బసవరాజ్ బంకర్, మేఘనాథ్, కోరిపం పాపతి, లింగప్ప, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారాం



రథోత్సవానికి హాజరైన భక్తులు

వైభవంగా జడే సిద్దేశ్వర రథోత్సవం

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో మంగళవారం ప్రసిద్దిగాంచిన జడే సిద్దేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా చేపట్టారు. ప్రతి యేటా ఈ రథోత్సవం కంప్లి నియోజకవర్గంలో కన్నుల పండువగా నిర్వహించుకుంటామని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఐదు రోజులు ముందుగానే అమావాస్య రోజు 101 జోడు ఎద్దులతో ఊరేగింపు అలాగే 101 కలశాల మహిళలు ఊరేగింపు భాజభజంత్రీల మధ్య ఊరేగింపు చేపడతారు. ఐదు రోజుల అనంతరం జడే సిద్దేశ్వరాలయంలో ఉదయం నుండి సాయంత్రం ఆలయం ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. ఎమ్మిగనూరుతో పాటు కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి, సిందనూరు రాయచూరు, కొప్పళ, హోస్పేట, గంగావతి, చుట్టుపక్కల గ్రామాల నుండి ఎద్దుల బండ్లపై రథోత్సవంలో పాల్గొని పూలు, పండ్లతో స్వామి వారికి రథానికి మొక్కులతో సమర్పించుకున్నారు.



ప్రత్యేక అలంకరణతో జడసిద్దేశ్వరస్వామి

హోసూరు జోన్



సబ్ కలెక్టర్ అకృతిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ వినతి

హోసూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాలకుపైగా ఉంటున్నవారికి ఇళ్ల స్థలాలు పట్టా కోరుతూ ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హోసూరు సబ్ కలెక్టర్ అకృతిశెట్టికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఆదిల్ మాట్లాడుతూ రాంనగర్ ప్రాంతంలో నాలుగైదు దశాబ్దాలకుపైగా పోరంబోకు స్థలాల్లో ఉంటున్నవారికి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆమేరకు మూడు నెలల్లో పార్వతీనగర్ కాలేకుంట, చెన్నత్తూరు నివాసులకు సర్వే చేసి రెవెన్యూశాఖ పట్టాలు జారీ చేసిందన్నారు. అలాగే రాంనగర్‌లో కొంతమందికి ఇప్పటికే భూమి పట్టాలు మంజూరు చేయగా మరో ప్రాంతంలో ఇంకా ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు కాలేదన్నారు. తమిళనాడు ప్రభుత్వం ప్రకటించినట్లుగా రాంనగర్ ప్రాంతాలలో చాలా కాలంగా నివసిస్తున్న పేద, సామాన్యులకు ఇళ్ల పట్టాలు జారీ చేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ మాధయ్యాన్, మున్సిపల్ కార్యదర్శి శంకరయ్య, ఉప కార్యదర్శి నూరు, చిన్నస్వామి, ముబారక్, సుల్తాన్ తదితరులు పలువురు పాల్గొన్నారు.

చీటీ నిర్వాహకుడు ఆత్మహత్యాయత్నం



ప్రభుత్వ ఆసుపత్రి ముందు గుమిగూడిన బాధితులు

హోసూరు(క్రైం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని పార్వతినగర్ ప్రాంతానికి చెందిన ఫరూఖ్(35) పదేళ్లకుపైగా చీటీలు నిర్వహిస్తున్నారు. హోసూరు పట్టణ ప్రాంతంలోని తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు రోజువారీ మొత్తాన్ని చెల్లించేవారు. మధ్యతరగతి కుటుంబాలు సహా వందలాది మంది అతడి వద్ద చీటీలు వేశారు. 2 రెండు నెలలగా చీటీ ముగిసిన తర్వాత కూడా ఫరూఖ్ చాలా మందికి డబ్బులు చెల్లించలేదు. అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడని ఆరోపిస్తూ బాధితులు అప్పట్లో కృష్ణగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫరూఖ్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. ఈ తరుణంలో అకస్మాత్తుగా తన ఇంటికి వచ్చిన ఫరూఖ్ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుప్రక్కలవారు అతన్ని చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇది తెలుసుకున్న స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఫరూఖ్‌కు ప్రథమ చికిత్స అందించాక మెరుగైన చికిత్స కోసం కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై హోసూరు నగర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కొంతమంది బాధితులు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా ఆయన వద్ద నమ్మకంతో చీటీ వేశామన్నారు. ఒక్కసారిగా ఇలా చేయడం షాకింగ్‌గా ఉందన్నారు. అతను రూ.50 వేలు నుంచి లక్షల దాక చీటీ నిర్వహిస్తాడని, సుమారు రూ.5 కోట్లకు పైగా ప్రజలకు బాకీ ఇవ్వాల్సి ఉందని తెలుస్తోందన్నారు. డబ్బులు వాపసు ఇచ్చే ఉద్దేశ్యం లేకనే అతను ఆత్మహత్యకు ప్రయత్నించాడని ఆరోపించారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

మాదకద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహన

హోసూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హోసూరు ఆర్‌వి ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాల, బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో జాగృతి కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి సెందిల్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవలికాలంలో యువత త్వరగా నిస్పృహకు లోనై ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. మార్కులు తక్కువ వచ్చినా, పోటీలలో ఓడిపోయినా ఆత్మహత్యకు ఒడిగట్టడం అధికమైందన్నారు. చిన్నచిన్నవాటికి ఇలా నిరాశ, నిస్పృహకు లోనుకావడం సరికాదన్నారు. ప్రతి పనిలోనూ విజయం సాధించాలన్న తపన ఉండడంలో తప్పేమీ లేదని, అయితే ఒకవేళ ఓటమి చెందినంత మాత్రాన ఆత్మహత్యకు పాల్పడడం సరికాదన్నారు. అలాగే మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. రెడ్ క్రాస్ నిర్వాహకులు భాస్కరన్, వైద్యులు మహేశ్, మహేంద్రవర్మ తదితరులు స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ఆరోగ్యపరంగానే కాక కుటుంబ జీవితంపైనా ప్రభావం చూపుతుందన్నారు.

మహిళలు, పిల్లలపై దౌర్జన్యాలను అరికట్టాలి

● ఐఓఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శోభ ● విద్యార్థులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు



సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శోభ

బళ్లారి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఐఓఎస్ఎస్(అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం) రాష్ట్ర కార్యదర్శి శోభా పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని రాయల్ సర్కిల్లో సంతకాల సేకరణ ప్రచారాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. మహిళలు, పిల్లలుపై నేరాలు ఇటీవల అధికమయ్యాయన్నారు. నిర్భయ, ఆసిఫా, ప్రియాంక రెడ్డి, అభయ్‌ల దారుణమైన అత్యాచారాలు, హత్యలు, మహిళా రెజర్ల పట్ల అగౌరవం, హాసన్ లైంగిక కుంభకోణం దేశ ప్రతిష్టను దెబ్బతీశాయన్నారు. రాష్ట్రంలో కూడా బాలికలపై అత్యాచారాలు పెరిగి పోయాయన్నారు. ఇటీవల హుబ్బళ్ళి, తోరణగల్లు, మైసూర్‌లలో బాలికలపై జరిగిన దారుణాలు అందరి మనుసులను కదిలించాయన్నారు. అదనంగా మద్యం మాదకద్రవ్యాలు నైతిక మూలాలను నాశనం చేస్తున్నాయి. ఇటువంటి అమానీయ వ్యవస్థకు వ్యతిరేకంగా మనమందరం సుదీర్ఘ పోరాటానికి సిద్దం కావాలన్నారు. కార్యక్రమంలో ఐఓఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరీ మాట్లాడుతూ నేటి పోలీసులు, పరిపాలన, న్యాయవ్యవస్థ మహిళలు, పిల్లలపై నేరాలను నిరోధించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అందుకే నేరస్థులు ఎటువంటి భయం లేకుండా తిరుగుతున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, పద్మాగిరిజా, విద్యా, సౌమ్య, రేఖా, అభిలాష,సుజాత, బసమ్మ, పార్వతమ్మ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం: మాజీ మంత్రి రాజగౌడ

బళ్లారి గాంధీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో ఈ మధ్య కాలవలో కురిసిన అకాల వర్షాల కారణంగా వరి రైతులు తీవ్రనష్టపోయారని, రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వహిస్తోందని మాజీ మంత్రి రాజుగౌడ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ పదాధికారుల సమావేశంలో రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న దోరణిని ఎండగట్టారు. జిల్లాలో అకాల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట నోటికి రాకుండా పోయిందని, కనీసం రెండో పంటకైనా తుంగభద్ర జలాశయం నుండి సాగునీటిని అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం రైతుల వేదనను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టనుందని, నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ 50వేలు నష్టపరిహారం అందించాలనే ప్రధాన డిమాండ్‌తో జిల్లాలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నేపత్యంలో పార్టీ పరంగా తీసుకోవాల్సిన దిశానిర్దేశాల గురించి జిల్లా నాయకులు, కార్యకర్తలో చర్చించారు. ఇదే సందర్భంలో జిల్లా రైతు మోర్చ అధ్యక్షుడు జి.ఐనాథ్ రెడ్డి మాట్లాడు తూ, ఈ నెల 2వ తేదీన రెండోపంటకు నీరు వదలాలని రాయల్ సర్కిల్‌లో ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన నిర్వహించినట్లు సభకు గుర్తు చేశారు. ఇదే సందర్భంలో మాజీ ఎమ్మెల్యే జి.సోమశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు అనిల్, రాష్ట్ర రైతు మోర్చ ఉపాధ్యక్షులు గురులింగన గౌడ రాష్ట్ర బీజేపీ కార్యదర్శి దివాకర్, మహిపాల్, హనుమంతప్ప, మహేశ్వర స్వామిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజగౌడ

లక్ష్యసాధనలో మహిళలు ముందుండాలి: న్యాయాధికారి



కార్యక్రమాన్ని ప్రారంభించిన సివిల్ న్యాయాధికారి అశోక్

సిరుగుప్ప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధన కోసం మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని సిరుగుప్ప తాలుకా సివిల్ న్యాయాధికారి అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ హాస్టల్‌లో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని న్యాయాధికారి ప్రారంభించి మాట్లాడారు. నేటి రోజుల్లో మహిళలు అన్ని రంగాలలో దూసుకెళుతున్నారని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు మహిళల పెరుగుదలపై ఆధారపడి వుందని ఆయన తెలిపారు. ఆర్థిక, విద్య, రాజకీయంగా మహిళలు ముందుకు వెళుతున్నారని ఆయన తెలిపారు. అలాగే మహిళలపై పలుచోట్ల దౌర్జన్యం, వేధింపులు, కేసులు కూడా దాఖలవుతున్నాయని అలాంటి వాటికి చోటివ్వకుండా ధైర్యంగా జీవనోపాధి సాగించాలని ఆయన ధైర్యాన్ని పెంపొందించారు. కార్యక్రమంలో తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య, ఉప్పార వెంకోబ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

● ఆయుష్మాన్ కార్డుల పంపిణీలో డాక్టర్ దివ్య




వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ దివ్య

కంప్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సంఘ సంస్థలు చేపట్టే సదుపాయాలు ప్రతి గ్రామంలో సద్వినియోగ పరచుకోవాలని డాక్టర్ దివ్య తెలిపారు. కుడితిని సమీపంలోని సిద్దమ్మనహళ్లి గ్రామంలో మంగళవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేరీ సంగని మేరీ ఆధ్వర్యంలో గ్రామంలో ఆయుష్మాన్ కార్డు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మాట్లాడుతూ అదానీ సంస్థ ఎన్నో సేవా భావాలతో ప్రతి గ్రామంలో గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలు చేపట్టి గుర్తింపు పొందుతుందన్నారు. ఆయుష్మాన్ కార్డు పేద ప్రజలకు ఎంతో అనుగుణంగా ఏర్పడుతుంది. ఈ కార్డు వల్ల పేద ప్రజలకు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స పొందవచ్చునన్నారు. ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ రిజ్వాన్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా కార్యకర్తలు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం స్వాధీనం

సిరుగుప్ప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం సోనియా గాంధీ బైపాస్ రోడ్డులో బొలెరో వాహనంలో ఏడు క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న కారణంగా స్థానికుల సమాచారం మేరకు ఆహార పౌరసరఫరాల ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్ఐ పరశురామ్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. రూ.16,100 విలువ చేసే బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

28 నుంచి బళ్లారిలో సాహస పోటీలు



మాట్లాడుతున్నసంస్థ కార్యదర్శి కెనిత్ వర్మ తదితరులు

బళ్లారి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని కేఏ 34 ఆఫ్ రోడ్ చాలెంజ్ సంస్థ ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటుబళ్లారిలో నాలుగు చక్రాల సాహస పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కెనిత్ వర్మ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన 28న ఉదయం 8గంటలకు పోలా ప్యారడైజ్ హోటల్ నుంచి ఎమ్మెల్యే నాగేంద్ర పోటీలను ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి మహిళలు సహా 35 మంది పాల్గొంటున్నారన్నారు. మహారాష్ట్రలోని సతారా పూణే, విజయపం, కలబర్గి, హాసన్ , నరసింహరాజపుర, శివమొగ్గ, బెంగళూరు,మడికేరి సురపుర, గోవా, కేరళ నుంచి హాజరవుతారన్నారు. బళ్లారి తాలూకాలోని జానెకుంటే ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రంలో 4విభాగాల్లో పోటీలు నిర్వహించబడతున్నాయి. మెడిఫైడ్ పెట్రోల్/డీజీల్ వెహికల్స్, జెర్బ్ పెట్రోల్/డిజీల్, , థార్ 2020/జిమ్నీ ఉమెన్స్ కేటగిరిలో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు అంద జేస్తామన్నారు. మెదటి స్థానంలో నిలిచిన వారికి రూ. 30వేలు,రెండవ స్థానం రూ.20వేలు, మూడవ స్థానం 10వేలు అందజేస్తారన్నారు. విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు మార్టిన్ వింద్య వర్మ, కోశాధికారి డాక్టర్ రాహుల్,సంతోష్ మార్టిన్,విజయానంద్ రాజీవ్, దర్శన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.